క్లుప్తంగా

పార్శిల్ కార్యాలయాల్లో తనిఖీలు



వినుకొండ: పట్టణంలోని పలు పార్శిల్, రవాణా కార్యాలయాల్లో వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. పురుగు మందుల వ్యాపారులు పలువురు ఇతర ప్రాంతాల నుంచి అనధికారికంగా దిగుమతులు చేసుకుంటున్నారనే ఆరోపణలతో ఈ తనిఖీలు చేపట్టినట్లు ఏడీఏ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు, సిబ్బంది ఉన్నారు.

బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలి



వినుకొండ: అసెంబ్లీ సాక్షిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ కొత్త వీరాంజనేయరెడ్డి శుక్రవారం తీవ్రంగా ఖండించారు. గతంలో బాలకృష్ణ ఇంట్లో జరిగిన కాల్పుల్లో సైకోగా ప్రవర్తించింది ఆయనేనని, ఆయనకు మతిస్థిమితం లేని విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. అలాంటి వ్యక్తిపై మద్యం మత్తులో అసెంబ్లీ సాక్షిగా మాట్లాడటాన్ని తప్పుపట్టారు. వెంటనే బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



బొల్లాపల్లి: ఉపాధ్యాయుడిగా రాణిస్తూనే ఓ వ్యక్తి డాక్టరేట్ పొందారు. మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్లో లెక్కల ఉపాధ్యాయుడైన ఏకేవీ ప్రకాష్ క్రిస్టియన్ బైబిల్ పఠనం ద్వారా హైదరాబాద్‌కు చెందిన షెపర్డ్ థియోలాజికల్ సెమినరి సంస్థ ద్వారా డాక్టరేట్ పొందారు. ఇటీవల డాక్టరేట్ పట్టాను ఆ సంస్థ నిర్వాహకుల నుంచి అందుకున్నారు. ప్రకాష్ ఆధ్యాత్మికత వైపు మరింత స్థాయికి ఎదగాలని పాఠశాల హెచ్‌ఎం బ్యూలా హోసన్న, చంద్రజిత్ యాదవ్ తదితరులు అభినందించారు.

ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: మండలంలోని యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కారుచోలలో స్వస్థ్ నారీ – సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో 91 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి. భరద్వాజ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగర్‌బాబుకు న్యాయం చేయాలి



నరసరావుపేట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి మంచాన పడిన సాగర్‌బాబుకు న్యాయం చేయటంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శుక్రవారం జొన్నలగడ్డ రోడ్డులోని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కార్యాలయ ఎస్ఏఓకు వినతిపత్రం అందజేశారు. పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ , సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, ప్రసాదు, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, సాగర్‌బాబు భార్య కేజీయ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు కాంస్య పతకం సాధించిందని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ నెల 23, 24వ తేదీలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యార్థులు కె.నాగసుభాష్‌రెడ్డి, బి.విజయకుమార్ తదుపరి పోటీలకు కూడా ఎంపికయ్యారని వివరించారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ పోటీలో వారు ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు, కోచ్ షేక్ మహమ్మద్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



లింగారావుపాలెంలో ధనలక్ష్మి అలంకరణలో పార్వతీదేవి



నాదెండ్ల: శివప్రియనగర్ గండిపోచమ్మ ఆలయంలో...



నాదెండ్ల: కన్యకాపరమేశ్వరి ఆలయంలో...



శావల్యాపురంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..



నరసరావుపేట ఈస్ట్: మహాలక్ష్మి అలంకరణలో..

నరసరావుపేట ఈస్ట్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు

అమ్మవారికి ఘనంగా పూజలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలోని శ్రీకనక దుర్గమ్మ వారి దేవాలయంలో నాలుగో రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవి అలంకరణతో ఐదవరోజు శుక్రవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ పూజారి రావిపాటి సాయి భరత్ అమ్మవారిని పూలదండలు, నూతన వస్త్రాలు, వెండి ఆభరణాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. అలాగే నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ఆలయ ధర్మకర్త మద్దినేని హరిబాబు, కేతేపల్లి వెంకటేశ్వర్లు దంపతులు పూజలు ఘనంగా నిర్వహించారు.

యడ్లపాడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు.



నరసరావుపేట ఈస్ట్: ప్రత్యేక అలంకరణలో అంకమ్మ



రొంపిచర్ల: రెడ్డినగర్‌లో ధనలక్ష్మి అలంకరణలో..



రొంపిచర్ల: విప్పర్ల శ్రీ మహాలక్ష్మి అలంకరణ



మహాలక్ష్మి అలంకరణలో పార్వతి అమ్మవారు



మోహిని అలంకరణలో శ్రీశారదాంబ

శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ.. జిల్లాలో పలు కంపెనీలకు ఇచ్చిన భూములలో రైతులను బెదిరించి లాక్కున్న భూముల తోపాటు అసైన్డ్ భూములను చట్టప్రకారం వెనక్కి తీసుకోవాలన్నారు. ఎంతమందికి ఉపాధి కల్పించారనే అంశంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని కోసం రైతులు ఇచ్చిన భూమిని పట్టించుకోకుండా మళ్లీ భూమి తీసుకోవాలనుకోవడం సమంజసం కాదన్నారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, రైతు సంఘ కార్యదర్శి ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, ఎస్.ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తిగీతాలను ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని దాసరి కాలనీలో శ్రీ కనకదుర్గ నాగేంద్రస్వామి గుడిలో దసరా సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విజయదశమిని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్తలు చెన్నూరి ఏడుకొండలు, చెన్నూరి పెద బ్రహ్మేశ్వరరావు, కార్యనిర్వాహక సభ్యులు చెన్నూరి చిన్న బ్రహ్మేశ్వరరావు, తుపాకుల హరికృష్ణల ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను కొనసాగాయి. నాదెండ్ల గ్రామానికి చెందిన శ్రీ సీతారామాంజనేయ భజనబృందం సభ్యులు భజన కార్యక్రమం నిర్వహించారు. వేములపల్లి శ్రీరంగం, గంగవరపు అవినాష్, చెవుల వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు తమ మధురమైన గాత్రంతో భక్తి పాటలను ఆలపించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాజరాజేశ్వరీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పిల్లలకు సరైన ఆహారాన్ని అందించండి



చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తిలకిస్తున్న వైద్యాధికారి, తదితరులు

రొంపిచర్ల: బరువు తక్కువగా ఉన్న పిల్లలు సరైన పోషక ఆహారం అందించాలని రొంపిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఎక్కువ పోషక విలువలు ఉన్న చిరుధాన్యాలను పిల్లలకు ఆహారంగా ఇవ్వాలన్నారు. ఈ మేరకు అంగన్‌వాడీల కార్యకర్తలు ప్రదర్శించిన చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మరియకుమారి, గడిపూడి నరసింహారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు జి. లక్ష్మి, కె. విజయలక్ష్మి, జి. సంధ్య, ఆశా వర్కర్లు వాసవి, సుశీలమ్మ, ఏఎన్ఎంలు, ఎంయల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన

దొడ్లేరు(క్రోసూరు): హెచ్ఐవీ నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. శుక్రవారం దొడ్లేరులో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మొబైల్ వాహనం ప్రాజెక్టర్ ద్వారా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాంసన్ మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాప్తి చెందే పద్ధతి, నివారణ చర్యలను వివరించారు. కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భూలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త అనుపమ, టీబీ సూపర్‌వైజర్ సౌజన్య, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎల్.నాగలక్ష్మి, కె.ఈశ్వర్, ఎం .జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

పత్తి రైతు దిగాలు



అచ్చంపేట మండలంలో నీటమునిగిన పత్తి పంట

అచ్చంపేట: అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు రైతన్నకు తీవ్ర శోకాన్ని మిగిల్చాయి. తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి రైతులు బెంబేలెత్తుతున్నారు. ముందస్తుగా వేసిన పత్తి పంటలు పూత, పిందె దశకు చేరుకునేదశలో.. కురుస్తున్న వర్షాలకు అవి మొత్తం రాలిపోతున్నాయి. వర్షాలు మరో రెండు, మూడు రోజులు ఇలాగే కొనసాగితే పంట మొత్తం పీకేసుకునే పరిస్థితులు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా ఇదే సమయంలో అధిక వర్షాలకు పత్తి పంటలు మొత్తం నీటిపాలై, దిగుబడులు లేక, పెట్టిన పెట్టుబడులు రాక, కాస్తోకూస్తో పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతన్నలు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాదైనా అనుకూల పరిస్థితులుంటాయన్న గంపెడాశతో పత్తి పంట వేసిన రైతులు.. కురుస్తున్న భారీ వర్షాలకు బెంబేలెత్తుతున్నారు. గత ఏడాది మిర్చి పంటకు అపార నష్టం వాటిల్లడంతో ఈ సంవత్సరం అచ్చంపేట మండలంలో 6వేల హెక్టార్లకు పైగా పత్తి పంట వేశారు. ఒక్కొక్క రైతు ఇప్పటివరకు ఎకరానికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టామని చెబుతున్నారు. కౌలు రైతులైతే ఎకరాకు మరో రూ.20వేల నుంచి 30వరకు భూములను కౌలుకు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆశాజనకంగా ఉన్న పత్తి పంట మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూత, పిందె పూర్తిగా రాలిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

పాఠశాల రికార్డు అప్పగింతకు సిద్ధం

యడ్లపాడు: విద్యారంగంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలోని లూథరన్ ఉన్నత పాఠశాల మూసివేతకు చర్యలు వేగమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి ఎం. నాగరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24వ తేదీన విద్యాశాఖ ఆర్జేడీ ఉత్తర్వుల మేరకు గురువారం నరసరావుపేట డీవైఈవో ఎస్ఎం సుభాని హైస్కూల్‌ను సందర్శించారని తెలిపారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశమై వారిని బదిలీ చేసేందుకు సమ్మతి పత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను విద్యాశాఖకు అప్పగించాలని సూచించడంతో, శనివారం ఉదయం వాటిని అప్పగించనున్నట్లు వెల్లడించారు.

రైల్వే ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ



నరసరావుపేట టౌన్: నరసరావుపేట రైల్వే ఎస్ఐగా ఎం.రాజమోహన్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మార్కాపురంలో ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

అవసరం మేరకే యూరియా వాడండి



రొంపిచర్ల: మండలంలో రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు శుక్రవారం పరిశీలించారు. వరి పైరు ప్రస్తుతం ఆరోగ్యంగా ఉందన్నారు. ఎలాంటి పురుగు, తెగుళ్లు ఆశించలేదన్నారు. వరిపైరుకు మోతాదుకు మించి యూరియా వాడితే పురుగు, తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. అవసరానికి మించి యూరియా వాడటం వల్ల పంటకు అనర్థం అన్నారు. వాతావరణ పరిస్థితుల్లో పైర్లకు ఆశించబోయే తెగుళ్లు, పురుగుల గురించి కూడా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.శివలలిత, ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మండలంలో వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. రొంపిచర్లలో శుక్రవారం ఉదయానికి 5.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. గత వారంగా మండలంలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పిడుగురాళ్ల: పట్టణంలోని ఎల్ఐసీ కృష్ణారావు బజార్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 364 పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళల ఆరోగ్య సంరక్షణలో భాగంగా రాష్ట్రం వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో స్వస్థనారి స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని ద్వారా వైద్య పరీక్షలు నర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ముఖ్యమంగా మహిళల్లో నోటి, రొమ్ము, గర్భాశయ తదితర క్యాన్సర్‌కి సంబంధించి వైద్య పరీక్షలు చేసి వాటిపై అవగాహన కల్పించటం జరిగిందన్నారు.

జీవన విధానంలో పరిశుభ్రత భాగం కావాలి



కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరిబాబు తదితరులు

చిలకలూరిపేట: పరిశుభ్రత ప్రజల జీవన విధానంలో భాగం కావాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే శుభ్రత సాధ్యమని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించటానికి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. తద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు కూడా మాట్లాడారు. ఈ సందర్భంగా కేబీరోడ్డులో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ రమణారావు, సునీత, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి రమేష్

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయిలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, బ్యూరో ఆఫ్ పోలీసు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో సీసీటీవీ నిఘా భద్రత, ఫోరెన్సిక్ హ్యాక్‌థాన్ 2.0ను సైబర్‌పీస్ సంస్థ నిర్వహిస్తోంది. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జట్టులోని విద్యార్థులు సత్తా చాటారు. జట్టు ఫైనలుకు చేరింది. ఏఐ చివరి సంవత్సరం విద్యార్థులు కోమలి కడియాల, జయ విజయ సరీల్ల, రాజశేఖర్ లింగాలలు జట్టులో సభ్యులుగా ఉన్నారు. దేశవ్యాప్తంగా 750కు పైగా జట్లు పోటీపడ్డాయి. టాప్ 12 ఫైనలిస్టులలో వీరు చోటు దక్కించుకున్నారు. ఈ నెల 29, 30వ తేదీలలో ఢిల్లీలో నిర్వహించే ఫైనల్‌లో విద్యార్థులు పాల్గొననున్నారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఏఐ విభాగాధిపతి డాక్టర్ బి.ఝాన్సీ వజ్రంలు అభినందించారు.

చక్కటి చేతిరాతతో మంచి భవిత



బహుమతులు అందిస్తున్న దృశ్యం



చేతిరాత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నాదెండ్ల: చక్కటి చేతిరాత విద్యార్థుల ఉజ్వల భవితకు దారి చూపుతుందని కాలిగ్రాఫర్, నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత జున్నుసాహెబ్ చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి చేతిరాతను అలవర్చుకోవాలని, తద్వారా ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. చేతిరాత ప్రాముఖ్యత, పాటించాల్సిన నిబంధనలు వివరించారు. ఉదయం శిక్షణనిచ్చారు. హెచ్‌ఎం మేకల కిషోర్, స్కూల్ అసిస్టెంట్ కనకం రంగారావులు విజేతలకు బహుమతులు అందించారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న పలు సంఘాల నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులను నిరోధించాలని ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు రైల్వేస్టేషన్ ఆవరణ నుంచి కలెక్టరేట్ వరకు చేపట్టనున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని ఐక్య ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గొల్లమూడి రాజా సుందర్ బాబు కోరారు. శుక్రవారం ప్రకాష్‌నగర్‌లోని వెస్ట్ పారిస్ లూథరన్ చర్చి అంధుల స్కూలు వద్దనున్న కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 రాష్ట్రాల్లో మత మార్పిడి వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరారు. జైళ్లలో మగ్గుతున్న విశ్వాసులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ అధ్యక్షులు పాస్టర్ పి.సుబ్బారావు కూడా ప్రభుత్వాల తీరును తప్పుబట్టారు. అనంతరం కరపత్రం ఆవిష్కరించారు. పట్టణ పాస్టర్ల సంఘ అధ్యక్షుడు సీహెచ్ డేవిడ్‌రాజు, కాలువ ఏసుపాదం, వి.రత్నకుమార్, ఎం .వీరారెడ్డి, పట్టణ ఈస్ట్ పారిస్ చర్చి క్రైస్తవ నాయకులు గుజ్జర్లపూడి కన్నల్, పట్టణ టౌన్ చర్చి సంఘ అధ్యక్షుడు బొమ్మ బాబురావు పాల్గొన్నారు.

పింఛనుదారులకు నోటీసులపై నిరసన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పింఛనుదారులు

శావల్యాపురం: అర్హత కలిగిన వారికి కూడా పింఛను రద్దుకు నోటీసులు జారీ చేయడం తగదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు (కొండలు) పేర్కొన్నారు. ఎస్సీ వర్గీయులు, చర్మకారులకు తగిన ఆధారాలు చూపించాలని అధికారులు నోటీసులు జారీ చేయటంతో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొండలు మాట్లాడుతూ మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందిన లబ్ధిదారులు దారా వీరాస్వామి, దారా నాగరాజు, దారా మోష, దారా ఏలియ్య తదితరులు చర్మకార వృత్తి చేయటం లేదని అధికారులు నోటీసులు అందజేశారన్నారు. వారు స్థానికంగా ఉంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరికి పింఛన్లు నిలుపుదల చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా నోటీసులు అందజేయటం సమంజసం కాదన్నారు. గతంలో ఇదే గ్రామానికి చెందిన కొర్రపాటి లక్ష్మీనారాయణ వలస వెళ్లారని పింఛను తొలగించటం అన్యాయమన్నారు. ఆయన గ్రామంలో నివాసం ఉంటున్నట్లు చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దారా లింగారావు, వైఎస్సార్ సీపీ నేతలు కొర్రపాటి రామాంజనేయులు, ఆళ్ళ రాముడు, ఎస్సీ కాలనీవాసులు ఉన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

సత్తెనపల్లి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్ కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్ –2025లో శుక్రవారం అచ్చంపేటరోడ్డులో చెత్త, వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయొద్దని, పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు ఉన్నారు.

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదలలో స్వచ్ఛతాహీ సేవ అవగాహన ర్యాలీ శుక్రవారం జరిగింది. అక్టోబర్ 2 వరకు అన్ని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎంపీడీవో పి.రత్నం తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేసి ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి శివాజీ, ఏపీఓ ఏడుకొండలు, ఎంఆర్‌సీ బ్రహ్మానందం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.